## సాదుం జయరాం కథలు

# 6

# అడవి

మొగుడున్న రోజుల్లో సుందరమ్మకు సమస్యల్లేవు. జీవితాన్ని గురించీ, తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గురించీ ఆలోచించాల్సిన అవసరం అంతకన్నా లేదు. మొగుడు కన్ను మూయగానే అన్ని సమస్యలూ తనవే అయ్యాయి.

మొగుడు పోతూ పోతూ- పెళ్లాం బతికున్నన్ని రోజులూ గడప దాటకుండా కాలుమీద కాలు వేసుకొని తిని బతకడానికి ఆస్తిపాస్తులు మిగిల్చి ఉంటే- అది వేరే విషయం. సుందరమ్మ విషయంలో అలా జరగలేదు. అందుకనే సుందరమ్మ హృదయం పనిచెయ్యవలసిన సమయంలో మెదడు పనిచేసింది. పట్టుమని పదేళ్లన్నా కాపరం చేయందే కన్ను మూసిన మొగుడి శవం మీద పడి "నా దారి యేమిటి దేవుడా?" అని ఏడ్చింది. దారి అంటూ ఒకటి ఉంటే ఆమె ఏడుపు మరొకరకంగా ఉండేదేమో! "నారు పోసిన దేవుడు నీరు పోయకపోతాడా వూరుకో తల్లీ!" అని వచ్చినవారు ఓదార్చారు. ఆ క్షణం సుందరమ్మకీ అలాగే అనిపించింది. ప్రపంచంలో అందరి ఆడవాళ్లకీ మొగుళ్లున్నారా? అందరికీ ఆస్తిపాస్తులున్నాయా? అందరూ ఏదో రకంగా బతకటం లేదా? తనుమాత్రం బతకలేకపోతుందా? అనే ధైర్యం కలిగింది. ఆ ధైర్యమే కలక్కపోతే ఆ క్షణాన్నే ఆమెగుండె ఆగిపోయి ఉండేది?

కష్ట సమయాల్లో అయినవాళ్లు దగ్గరుంటే అదోరకం, సుందరమ్మకి ఎవరూ లేరు. తల్లిదండ్రులు ఎప్పుడో పోయారు. భర్త చనిపోయాడని తెలిసి అన్న మటుకు వచ్చాడు. వచ్చిన అన్న

అందరిలాగే వేదాంతం చెప్పాడు. రెండు రోజులుండి మూడోరోజు "వస్తానమ్మా! ఇంటిదగ్గర ఎక్కడి పనులక్కడే ఉన్నాయి" అని ప్రయాణమయ్యాడు.

సుందరమ్మకు కడుపులో చెయ్యిపెట్టి కెలికినట్లయింది. ఒక రక్తం పంచుకుపుట్టినవాళ్లు, తను కష్టంలో ఉన్నది- వచ్చినవాడు మంచో చెడో చెప్పి వెళ్తాడనుకుంది. అలాటిదేమీ లేకుండానే వెళ్లడానికి పయనమయ్యాడు. సుందరమ్మ దుఃఖం ఆపుకోలేక బావురుమంది.

"ఊరుకో అమ్మా! ఏడిస్తే పోయినవాళ్లు వస్తారా! ఎలా జరగాల్సి ఉంటే అలా జరుగుతుంది" అంటూ ఓదార్చాడు.

పోయినవారి కోసం ఏడ్వడం లేదు. ఉన్న ఒక్క అన్నా చచ్చినవానితో సమానమయ్యాడే అని ఏడుస్తున్నాను అని చెప్పాలనిపించింది. కాని ఏడుపు దిగమింగి 'వెళ్లిరా' అంది.

పదిరోజులు పట్టు మాసంరోజులు మంచంపట్టి దుఃఖం వెళ్లగక్కడం జరుగుబాటు ఉన్నవాళ్లకు చెల్లుతుంది. సుందరమ్మ వారం పదిరోజుల్లో మామూలు మనిషి కాక తప్పలేదు. అన్నం ముందు కూకున్నప్పుడో రాత్రి పడుకున్నప్పుడో మొగుడు జ్ఞాపకానికి వస్తూనే ఉన్నాడు. అదో బాధ. అంతకంటే బాధాకరమైంది- ఎలా జీవించడం అన్నది. ఖర్మకొద్దీ తనొక్కతే కాదు, ముగ్గురు పిల్లలున్నారు. ఈ పసిబిడ్డల్ని నెత్తినేసుకొని సంసారం ఎలా ఈదడమా అన్నది అనుక్షణం మెదడ్లో తొలుస్తూనే ఉంది. ఎంత గింజుకున్నా దానికి సమాధానం రాదు. ఏడుపు వస్తుంది. ఏడుస్తూ కూచున్నప్పుడల్లా ఇరుగమ్మో, పొరుగమ్మో వచ్చి "ఊరుకో తల్లీ పోయినవాళ్లతో మనమూ పోతామా? గుండె దిటవు చేసుకోకపోతే లాభం లేదమ్మా" అంటున్నారు.

సుందరమ్మ ఏం చెబుతుంది. తన బాధ ఒకరితో చెప్పుకుంటే తీరేది గనకనా?

సుందరమ్మ ఒకవైపు ఇలా కుములుతూనే వుంది. మరొకవైపు బాకీ అసాములు ఇంటిచుట్టూ తిరగడం ప్రారంభించారు. ఎద్దుపుండు కాకికి ముద్దా? వచ్చినవాళ్లు కాస్త పరామర్శించి బాకీ విషయం కదుపుతున్నారు. సుందరమ్మకు ఏం చెప్పడానికి నోరు రాదు, మొగానికి చెంగు అడ్డంవేసుకొని వెక్కి వెక్కి ఏడ్చేది. ఎంత బాకీ ఆసాములయినా వాళ్లలోనూ మానవత్వం అంతో ఇంతో మిగిలే ఉన్నట్లుంది. పోనీ పాపం ఇంకా బాధలో ఉన్నట్లుంది. ఇంకో నెల ఆగి చూద్దాం అనుకొని వెళ్తున్నారు. వెళ్తూ వెళ్తూ వడ్డీ మొదలూ తమకెంత రావాలో చెప్పి పోతున్నారు. సుందరమ్మ అన్నీ లెక్కవేసుకొంది. దాదాపు పదివేలు. మొగుడు పోతూ పోతూ తనకు మిగిల్చిందేమిటి? ఏడెకరాల మెట్ట, అది అమ్మకానికి పెడితే పదివేలు రావచ్చు. లేదా ధరలు బాగున్నాయి గనుక మరో రెండు, మూడువేలు ఎక్కువే రావచ్చు. బాకీలు పోను రెండు వేలు, మూడు వేలు మిగిలితే దాంతో జీవితాంతం ఎలా బ్రతకడం?

కష్టం సుఖం ఎరిగిన లౌకికుడు ఒకడు సుందరమ్మకు ఈ విషయంలో ఒక సలహా ఇచ్చాడు.

"సుందరమ్మా! ఉన్నదంతా అప్పుల వాళ్లకు వూడ్చి పెడితే నీకు చిప్ప చేతికొస్తుంది. పసిబిడ్డలూ నువ్వూ అలో లక్ష్మణా అని ఆకులు మెయ్యాలి. రెండెకరాలు అమ్మి అప్పులవాళ్లకి నాలుగణాల వంతో, ఐదణాల వంతో దామాషా ఇవ్వు. మిగిలిన భూమితో ఏదో రకంగా గడుస్తుంది."

సుందరమ్మకిది దివ్యమైన సలహాలాగే కనిపించింది.

"అప్పులవాళ్లు ఒప్పుకుంటారా?" అంది సంకోచిస్తూ.

"నోరూ వాయీ లేని వాళ్లని చూస్తే ఛస్తే ఒప్పుకోరు. నువ్వు కొంచెం గట్టిగా నిలబడాలి. ఉన్నదంతా మీ మొఖాన కొడితే నాకు ఆదరువు ఏమిటని మొండికి పడు. ఇది ఊరా? అడివా? నలుగురూ కూడి ఏదో ఒకటి చేస్తారు" అన్నాడు ఆ పెద్ద మనిషి.

సుందరమ్మకిదేం నచ్చలేదు. మొగుడున్న రోజుల్లో సుందరమ్మ, పరాయి మగాడితో మాట్లాడి ఎరుగదు. నలుగురు మొగాళ్లుంటే వారి ముందు నుంచి నడిచి వెళ్లాలన్నా సిగ్గు. అలాంటిది ఇప్పుడు నలుగురి ఎదుటా నిలబడి... ఈ ఆలోచన సుందరమ్మకు నచ్చలేదు.

"ఈ పని నేను చెయ్యలేను" అంది.

"పోనీ పెద్దవాడు మీ బావ ఉన్నాడు... ఆయనతోనన్నా మాట్లాడు. ఆయనే ఏదో ఒకటి చేస్తాడు" అని ఆ పెద్దమనిషి మరో సలహా ఇచ్చాడు.

నిజమే ఊళ్లో బావగారున్న మాట వాస్తవమే. సుందరమ్మ భర్త ఉన్న రోజుల్లో ఆ అన్నా తమ్ముళ్ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. అన్నా తమ్ముళ్ల మధ్యనే ఆపేక్షలు లేకపోయాక తోటి కోడండ్రకు వుంటాయా? సుందరమ్మకీ తోడుకోడలికి కూడా పడేది కాదు. తమ్ముడు పోతే అన్న అందరిలాగే వచ్చి అందరిలాగే వెళ్లాడు. అట్లాంటివాళ్ల దగ్గరికి వెళ్లి సాయం అర్థించటమంటే సుందరమ్మకు మొదట మనస్కరించలేదు. తర్వాత ఆలోచిస్తే వెళ్లడమే మంచిదనిపించింది. తను మగదక్షత లేనిది. పంతాలు పట్టింపులు తనకెందుకు? అనుకుంది.

చీకటిపడ్డాక నెత్తిన ముసుగేసుకొని పిల్లల్ని వెంటబెట్టుకొని బావగారింటికి వెళ్లింది.

వెళ్లేసరికి బావగారు, తోటికోడలు ఇద్దరూ ఇంట్లోనే ఉన్నారు.

"ఏమ్మా ఎందుకొచ్చావు?" అన్నాడు సుందరమ్మ బావ.

సుందరమ్మ తను వచ్చిన పనేమిటో విడమర్చి చెప్పింది. "బాకీ ఆసాములు నాలుగుణాల వంతో ఐదణాల వంతో తీసుకుంటే, వాళ్ల కొంపలు కూలవు- నా కొంప నిలుస్తుంది. నాకు, నా పిల్లలకు ఇంత నిలువనీడ దొరుకుతుంది. ఈ విషయంలో మీరే ఏదో ఒకటి చెయ్యాలి. మీకన్నా, నాకు అయినవాళ్లు ఎవరున్నారు? అంది దీనంగా.

"రామ! రామ ఇవేం బుద్ధులు సుందరమ్మా? ఫలానా రామకృష్ణ చచ్చిపోగానే, అతని పెళ్లాం బాకీలు ఎగవేసి ఆస్తి అట్టే పెట్టుకుందంటే ఎంత నామర్దా. లోకులు మొగాన ఉమ్మెయ్యరూ? మీ బావగారు తలెత్తుకుని తిరగాలా వద్దా?" అంది గుక్క తిప్పుకోకుండా తోడికోడలు.

"నీకెవరో బుద్ధిలేనివాళ్లు ఇచ్చారు ఈ సలహా. అప్పులు ఎగవేయడం, ఐపిలు పెట్టడం మన ఇంటా వంటా లేదు. ఏదిబడితే అది చేయడమేనా? పరువు ప్రతిష్ఠ విషయం ఆలోచించనవసరం లేదా?" అని బావగారు ఛీ కొట్టారు.

సుందరమ్మకి కాళ్లకింద భూమి తొలుచుకుపోతున్నట్లనిపించింది. ఇట్లా జరుగుతుందని ఊహించలేదు.

ఆ పెద్దమనిషికి పరువు ప్రతిష్టలు పట్టాయి. తన బ్రతుకు తెరువు విషయం పట్టలేదు. ఉన్న ఆస్తి అప్పులవాళ్లు రాబందుల్లా తన్నుకుపోయాక, తను కూలో నాలో చేసుకుంటూ బజార్నపడితే ఆయన పరువు ప్రతిష్టలు ఇనప్పెట్టెలో ఉన్నట్లు భద్రంగా ఉంటాయా?

ఛీ ఛీ ఏం మనుషులు! అనుకుంది సుందరమ్మ. సుందరమ్మ ఇంటికి వచ్చి భోరున ఏడ్చింది. బాగా చీకటి పడింది. దీపంకూడా వెలిగించాలనిపించలేదు. అలాగే ఏడుస్తూ పడుకుంది. తలుపు దగ్గర ఏదో అలికిడి అయినట్లుంటే లేచి దీపం వెలిగించి వాకిట్లోకి వచ్చింది. వాకిట్లో రంగరాజు నిలబడి ఉన్నాడు.

చిత్రం! సుందరమ్మ ఇన్నాళ్లూ మరో బాకీ ఆసామిని మర్చేపోయింది!

"ఏం రాజూ! నువ్వూ బాకీ అడగటానికే వచ్చావా?" అంది సుందరమ్మ.

రాజు గతుక్కుమన్నాడు. అసలే నోట్లో నాలుకలేని మనిషి "లేదు చూచి పోదామని వచ్చాను" అన్నాడు నత్తినత్తిగా.

అత్తమీద కోపం దుత్తమీద చూపినట్టు ఏదో అలా అందికాని, రాజు పరామర్శించి పోవడానికే వచ్చాడని సుందరమ్మకి తెలుసు.

"చూసేదేముంది నాయనా! దిక్కులేని దాన్నిగా మిగిలాను" అంది కళ్లు వత్తుకుంటూ.

సుందరమ్మ కంట తడి చూచి రాజు కంట తడిపెట్టాడు. తన కోసం కంటతడిపెట్టే ప్రాణి ఒకటి ఉందని సుందరమ్మకు ఇప్పుడే తెలిసింది.

"ఈ పదిహేను రోజుల్నుంచి ఎక్కడ భోంచేస్తున్నావ్?" అంది సుందరమ్మ.

"సర్పంచ్‌గారింట్లో భోంచేస్తున్నా" అన్నాడు రాజు. "పోనీ రేపట్నుంచి ఇక్కడికే రారాదూ" అంది సుందరమ్మ.

"నా భోజనానికేంలే ఇపుడు" అన్నాడు రాజు. రాజును సుందరమ్మ భోజనానికైతే పిల్చింది కాని-తన పరిస్థితి జ్ఞాపకం వచ్చి మళ్లీ సంకోచమూ కలిగింది. ఇన్నాళ్ల పరిస్థితీ వేరు. ఇప్పటి పరిస్థితి వేరు.

సుందరమ్మకు మూడేళ్లనాటి విషయం జ్ఞాపకానికి వచ్చింది. రాజును సర్పంచ్ వెంటబెట్టుకొని వచ్చాడు. ఆయన సుందరమ్మ భర్త రామకృష్ణను "ఒరే రామకృష్ణా! ఈ అబ్బాయిని మన వూరి హైస్కూలుకు టీచరుగా వేశారు. వెనకా ముందూ ఎవరూ లేరట. తిండి తిప్పల విషయం చూడటానికి మన వూళ్లో హోటళ్లు లేకపోయే! వీరి మంచిచెడ్డలు మనంచూడకపోతే ఎవరు చూస్తారు? మీ ఇంట్లో ఈ అబ్బాయికి అన్నం ఏర్పాటు చూడు. పడుకోటానికి స్కూలు ఉండనే ఉంది" అన్నాడు.

"ఏమో దాన్నడిగి చెబుతాను" అన్నాడు రామకృష్ణ. "సుందరమ్మని నువ్వు అడిగేదేమిటి? నేనే అడుగుతాను" అని సుందరమ్మని పిలిచి "నా మొగం చూచి అయినా ఈ అబ్బాయికి వండిపెట్టాలి సుందరమ్మా! తప్పదు" అన్నాడు సర్పంచ్.

పెద్దమనిషి ప్రాథేయపూర్వకంగా అడుగుతూంటే కాదనడానికి సుందరమ్మకు మనసొప్పలేదు. "అలాగే పెదనాన్నా!" అంది.

ఆరోజునుంచి రాజు తనింట్లోనే భోంచేస్తున్నాడు. తిన్నదానికి ఋణం ఉంచుకోకుండా నెలకి అరవై రూపాయలిస్తున్నాడు. అవసరమొస్తే మూడొందలు అప్పుగా కూడా ఇచ్చాడు. ఇన్నాళ్లూ రాజుకు అన్నం పెట్టడంలో లాభనష్టాలను బేరీజు వెయ్యలేదు. రాజు ఇచ్చే అరవై రూపాయలూ సుందరమ్మకు పెన్నిధిలా కనిపించాయి. రాజు తనింట్లో భోంచేయడం వల్ల అంతో ఇంతో మిగులుతుంది. తనున్న స్థితిలో అదైనా మేలే. సంకోచిస్తే లాభం లేదు. అందుకని సుందరమ్మ, రాజు లేచి వెళ్తుంటే మళ్లా చెప్పింది. "రేపట్నుంచి భోజనానికి ఇక్కడికే రా రాజూ!" అని. రాజు వస్తానన్నట్లు తల తిప్పాడు.

## 2

బావగారు, తోటికోడలు పెట్టిన చీవాట్లు తిన్నాక అప్పుల వాళ్లతో పేచీ పెట్టుకోవడానికి సుందరమ్మకి ధైర్యం చాల్లేదు. ముందు ముందు ఎలా జరగాల్సి ఉంటే అలా జరుగుతుంది. లోకులతో మాటలుపడటం ఎందుకు. అని భూముల్ని అమ్మకానికి పెట్టింది. చిత్రమేమిటంటే- కొంటామని ఒక్కరూ ముందుకు రాలేదు. భూమి కొనమని ఒకరిద్దరిని తనే ప్రాథేయపడింది.

"చేలో చేను- మీ బావగారు కొంటామంటున్నారు. మేం ఏం బాగుంటుది. ఆయనకే ఇవ్వడం న్యాయం" అన్నారు వాళ్లు. దోపిడీ చేసే వాళ్లకి కూడా సర్దుబాట్లుంటాయని సుందరమ్మ కేం తెలుసు. బావగారు కొంటారంటే మంచిదేఅనుకుంది. వెళ్లి ఆయన్నే అడిగింది కొనమని.

ఆ మహానుభావుడు కాబట్టీ కాబట్టనట్టు "ఎనిమిది వేలిస్తాను. ఇష్టమైతే అమ్ము. కష్టమైతే మానుకో. బలవంతం లేదమ్మాయ్" అన్నాడు.

పగటి దోపిడీ చెయ్యాలనుకుంటున్న బావగారిని చూస్తే సుందరమ్మకు మంట పుట్టింది. ఆ ధరకివ్వడానికి ఇష్టం లేదు. ఈయనేమో పోటీకి మరొకరు రాకుండా కట్టుదిట్టం చేసి, బలవంతం లేదంటున్నాడు. ఈ స్థితిలో తను ఏమి చెయ్యగలదు? కంఠదగ్గంగా శోకం ముంచుకొచ్చింది.

"మీ ఇష్టం. ఎంత న్యాయమని తోస్తే అంతే ఇవ్వండి" అని తన నిస్సహాయతను వెల్లడిచేసింది.

"న్యాయమైన ధరే చెప్పాను. కావాలంటే నలుగుర్నీ విచారించుకొనే వచ్చి అమ్ము. తొందరేమొచ్చిందమ్మా!" అన్నాడు సౌమ్యంగా.

ఎవరున్నారు తనకు విచారించటానికి? ఆయన అడిగిన ధరకే ఖాయం చేసింది.

బాకీలకు పోను ఒకటి రెండువేలు మిగులుతాయనుకుంది. అలాంటిది బాకీలకే సరిపోవడం లేదు. బాకీలు నెత్తిమీద పెట్టిపోయిన మొగుడిమీద సుందరమ్మకు కోపం వచ్చింది. ఆ తర్వాత ఆ కోపం బావగారి మీదికి మళ్లింది. "నీవారు నాశనంగాను, దిక్కూ మొక్కూలేని ఆడదాన్ని అన్యాయం చేసి నువ్వేం బావుకుంటావు!" అని ఒకటికి పదిసార్లు మనసులో తిట్టుకుంది.

ఇలా సుందరమ్మ మనసులో కుళ్లి చస్తుండగానే మరో సంఘటన జరిగింది. ఒకరోజు రాత్రి రాజు భోజనంచేస్తూ "మీ బావగారు ఇకమీదట నన్ను ఇక్కడికి భోజనానికి రావద్దన్నారు" అన్నాడు దీనంగా ముఖం పెట్టి.

సుందరమ్మ ఈ మాట విని దిగ్భ్రాంతి చెందింది. "ఎందుకంటా?" అంది కోపంగా. వివరించాల్సిన పనిలేదనుకున్నాడో ఏమో రాజు ఏం మాట్లాడలేదు.

"నేనూ, నా బిడ్డలూ పూటకింత తింటున్నామో లేదో ఎవరికీ పట్టదు. నా మానమర్యాదల్ని గురించి మట్టుకు జాగ్రత్తలు తీసుకుంటారు" అని సుందరమ్మ ఏడవటానికి మొదలుపెట్టింది.

రాజుకు ఇక భోంచెయ్య బుద్ధిపుట్టలేదు. తింటున్న పళ్లెంలో చెయ్యి కడిగి లేచాడు. ఆమెను ఎలా ఓదార్చాలో బోధపడలేదు. ఏడుస్తున్న ఆమెను వదిలి, చెయ్యి తుడుచుకుంటూ వెళ్లడానికి కాళ్లు రావటం లేదు. అలాగే స్థాణువులా మంచంమీద కూర్చున్నాడు. ఎంతసేపు చూచినా సుందరమ్మ అలాగే ఏడుస్తూ కూచుంది. లాభం లేదనుకుని రాజు వెళ్లడానికి లేచాడు.

"రాజూ!" అంది సుందరమ్మ ఏడుపు దిగమింగి. రాజు నిలబడి ఏమిటన్నట్లు చూచాడు.

"ఇక్కడే పడుకో" అంది.

రాజు తికమకపడ్డాడు. మనసులో ఉండాలనే ఉంది. కానీ భయంతో గుండెలు కొట్టుకొంటున్నాయి.

రాజు సందిగ్ధంలో పడ్డాడు.

ఈ మనిషి తటపటాయింపు చూస్తుంటే వళ్లు మండింది. రాజుకు మొదట్నించి తనమీద మనసన్న విషయం సుందరమ్మకు రూఢిగా తెలుసు. ఈ మాత్రం తెలుసుకోడానికి పెద్ద అతీంద్రియ జ్ఞానం అవసరంలేదు. ఏ ఆడదైనా తనపట్ల ఎదుటి మగవాడికి ఏ భావముందో తేలిగ్గా ఊహించగలదు.

"భయమా?" అంది సుందరమ్మ.

"అది కాదు నలుగురికీ తెలిస్తే..." అంటూ నీళ్లు నమిలాడు.

"తెలియనీ ఏం చేస్తారో చూద్దాం" అంది సుందరమ్మ.

రాజు ఇక ఏమీ మాట్లాడలేదు.

* * * *

పల్లెల్లో నిప్పులేకుండానే పొగ వస్తుంది. నిప్పు ఉంటే వేరే చెప్పాలా! వారం రోజులన్నా గడవందే ఊరంతా గుప్పుమంది. నిమ్మకు నీరెత్తినట్లు సుందరమ్మ ఏమీ లెక్కచేయలేదు. సుందరమ్మ బావ సుందరమ్మను ఇంటిదగ్గరకు పిలిపించి, నయానా భయానా కూడా మందలించాడు. సుందరమ్మ మొండికెత్తింది.

"నా బతుకు నాది. మీకెందుకు బాధ" అంది నిర్మొహమాటంగా.

దాంతో సుందరమ్మ బావగారు ఇటునుంచి లాభం లేదనుకొని అటునుంచి నరుక్కు రావడానికి ప్రయత్నించాడు. అంటే రాజును బెదిరించాడు. రాజు సుందరమ్మతో మొరపెట్టుకున్నాడు.

"నాకేదో భయంగా ఉంది. మీ బావగారు నా కాళ్లూ చేతులు విరిపిస్తానంటున్నాడు. ఏం చెయ్యను?" అని. సుందరమ్మకు సహనం చచ్చింది. రాజును చూస్తుంటే జుగుప్స కలుగుతోంది.

"కుక్కతోక పట్టుకొని గోదావరి ఈదాలనుకున్నాను. నాదే పొరపాటు. వాళ్లు కాళ్లూ, చేతులు విరుస్తామంటే నువ్వు మగాడివి కాదూ? ఒంగోలు కోడెలా వున్నావు. కోసేస్తే బండెడు కండలున్నాయి. ఆడదానికున్న పౌరుషం లేదేం నీకు?" అంది.

"నేనేమో పరాయి ఊరువాణ్ణి. పైగా గవర్నమెంటు ఉద్యోగిని" సమర్థించుకోబోయాడు.

"నోరు మూసుకో! పరాయి ఊళ్లో గవర్నమెంటు ఉద్యోగులు పౌరుషం లేకుండా బతకాలని రాసి పెట్టి ఉందా?" అని నోటిమీద కొట్టినట్లు మాట్లాడింది సుందరమ్మ.

ఇక నోరెత్తి మాట్లాడడానికి రాజుకు ధైర్యం చాల్లేదు. ఇక రెండు మాటలూ గట్టిగా అంటే, కంట తడిపెట్టడానికి సిద్ధంగా ఉన్నాడు. సుందరమ్మకు జాలి కలిగింది. "భయపడకు రాజూ! నేనున్నాను." అని ధైర్యం చెప్పి దగ్గరకు తీసుకుంది.

* * * *

తన బాధ్యత రాజు మోయవలసింది పోయి తనే రాజు బాధ్యత మోయవలసి వస్తుందని సుందరమ్మ ఊహించలేదు. తీరా ఇట్లా పరిణమించిన తర్వాత చేతులు ముడుచుకు కూర్చుంటే లాభం లేదు. ఏదో చెయ్యాలి. సుందరమ్మకు సర్పంచ్ జ్ఞాపకం వచ్చాడు. ఆయనకు రాజు మీద కూడా అభిమానమే. ఆయన తలుచుకుంటే ఏమైనా చెయ్యగలడు.

సుందరమ్మ సర్పంచ్ ఇంటికి వెళ్లి తన గోడు వెళ్లబోసుకుంది. "నా బతుకు నేను బతుకుతూ ఉంటే చూడలేక అంతా కళ్లల్లో నిప్పులు చల్లుకుంటున్నారు. మీరు ఊరికి పెద్దలు. మీరు కూడా చూస్తూ ఊరుకుంటే, ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటాను" అంది.

ఆయన అంతా విని "నాకు సవాలక్ష పనులు. తలమునకలుగా ఉన్నాను. తీరిక చేసుకొని నీ విషయం ఆలోచిస్తాను" అన్నారు.

ఒకవైపు కొంపలంటుకున్నాయి. ఈయనకు తీరిక దొరికేదెపుడోనని సుందరమ్మ భయపడింది. సుందరమ్మ ఊహ కరెక్టుకాదు. ఆరోజే దీపాలు వెలిగించే సమయానికి సర్పంచ్ సుందరమ్మ ఇంటికి వచ్చాడు. సర్పంచ్ తన విషయం మరిచిపోనందుకు సుందరమ్మకు సంతోషం కలిగింది. మంచం వాల్చి కంబళీ పరచి కూర్చోబెట్టింది.

ముసలాడు మీసాలు సవరించి అసలు విషయం బయటపెట్టాడు. "మీ ఇద్దరికీ ఏ భయమూ లేదని హామీ ఇస్తాను. నన్నూ ఒక కంట చూడాలి" అని.

సుందరమ్మ నిర్ఘాంతపోయింది. ఆయనకు, వయసులో తనకన్నా పెద్దదయిన కూతురు ఉంది. ఆయన తన్ను కోరుతున్నాడు. గుండెల్లో మంటలు లేచాయి. స్పృహతప్పి ఎక్కడ పడిపోతానో అనుకుంది. కాని స్పృహ తప్పలేదు.

"ఏమంటావ్?" అన్నాడు సర్పంచ్.

ఏమంటుంది సుందరమ్మ? తలవాల్చి శ్వాస బిగబట్టి-

"సరే" అంది.

**- (22, జనవరి 71, ప్రగతి వార పత్రిక, రష్యన్‌లోకి అనువాదం 1978)**